

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ నేత జీ.వెంకటేష్

ఇందిరాపార్కులో సమస్యలను పరిష్కరించాలి

▸▸ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా పార్కులో కనీస సౌకర్యాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. పార్కు అభివృద్ధి కార్యక్రమాల్లో వాకర్స్, స్థానికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం ఇందిరా పార్కు డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ మౌనిక, బీజేపీ రాష్ట్ర నాయకులు జీ.వెంకటేష్‌తో కలిసి పార్కును సందర్శించి వాకర్స్ సమస్యలు తెలుసుకున్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.సుధాకర్ యాదవ్, సభ్యులు ప్రభాకర్‌యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్, టీకేఎం.రెడ్డి తదితరులు పార్కులో కుక్కల బెడద ఉందని, తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్ల శుభ్రతపై ఫిర్యాదు చేశారు. పార్కులో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

అర్హులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. హిమాయత్‌నగర్ మండల పరిధిలోని అర్హులైన 51 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు.

నేడు బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం సమావేశం

గోల్నాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు ఛే నెంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారు. ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఏర్పాట్లను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరిశీలించారు. పార్టీ శ్రేణులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని నేతలకు సూచించారు.

డబ్ల్యూటీవో నుంచి భారత్ బయటకు రావాలి

రాంనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లి నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ టి.సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విదేశీ మార్కెట్‌కు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా డబ్ల్యూటీవో సదస్సులో పాల్గొనడం సరికాదన్నారు. డబ్ల్యూటీవోను దేశం నుంచి బయటకు పంపించే వరకు రైతుల పోరాటం కొనసాగుతుందన్నారు. నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సోమన్న, కిషన్, హన్మేష్, శోభన్, ప్రసాద్, పద్మ, శ్రీరామ్‌నాయక్, ధర్మానాయక్, స్వరూప, వరలక్ష్మీ, లక్ష్మీబాయి, కోట రమేష్, జావీద్, ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 307 సిటీ గవర్నర్ శ్రీనివాసచారి సూచించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యాపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ క్లబ్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. వైద్యులు మధుమేహం, బీపీ ఇతర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వివేక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్, కోశాధికారి కిరణ్, ఉపాధ్యక్షుడు రాజు, సభ్యులు నాగభూషణం, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, కామినేని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వసతి గృహానికి వంటసామగ్రి అందజేస్తున్న మహేష్ అగర్వాల్

వసతి గృహానికి వంట సామగ్రి అందజేత

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక, సేవారంగాల్లో రాణించినప్పుడే మానవ జీవితానికి సంతృప్తి ఉంటుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. సోమవారం తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో వనవాసి కల్యాణ పరిషత్ మల్లికార్జున విద్యార్థి వసతి గృహానికి వంటసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ, పేదలకు చేయూత అందించడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ కోశాధికారి ప్రేమ్‌చంద్ మునోద్, వీహెచ్‌పీ ప్రాంత ప్రముఖ్ దామోదరశెట్టి, వనవాసి కల్యాణ్ పరిషత్ ప్రతినిధి గట్టు అశోక్‌రెడ్డి, నాయకులు మనోహర్, రాజు, భక్తరాం పాల్గొన్నారు.

సీ.వీ.రామన్ అవార్డుకు సీ.హెచ్.వెంకటేశ్వర్లు యాదవ్ ఎంపిక



బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నిజాం కళాశాల ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సీ.హెచ్.వెంకటేశ్వర్లు యాదవ్ సర్ సీవీ.రామన్ స్మారక అవార్డు 2024కు ఎంపికయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. సీ.హెచ్.వెంకటేశ్వర్లు యాదవ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారని తెలిపారు. ఈ నెల 28న జ్ఞానభారతి మోడల్ స్కూల్ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నేటితరం అనుబంధాలను నిర్లక్ష్యం చేస్తోంది


చిక్కడపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అనుబంధాలు, కుటుంబవ్యవస్థను నేటితరం చేస్తోందని ప్రముఖ సినీ విశ్లేషకులు ఇమంది రామారావు అన్నారు. రాగసప్తస్వరమ్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో రమ్య జీవన బాట- రమణుల మాట అంశంపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. రామారావు మాట్లాడుతూ ఈనాటి పిల్లలకుసామాజిక మాధ్యమాలపై ఉన్న ఆసక్తి కుటుంబంలోని పెద్దలపైలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ నిర్వాహకురాలు వీఎస్ రాజ్యలక్ష్మి సమాజానికి తనవంతు సహాయం అందించాలన్న తపన ఉన్న సంస్కారవంతురాలని అభినందించారు. సివిల్స్ శిక్షణ నిపుణులు సర్వమంగళగౌరి రామాయణ కావ్య విశిష్టత వివరించారు. కార్యదర్శి అహల్య నివేదిక సమర్పించారు. డా.విజయభాస్కర్ పాల్గొన్నారు.

మార్చి 3న పల్స్ పోలియో

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మార్చి 3న నిర్వహిస్తున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 0-5 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. బూత్ ఆక్టివిటీ మార్చి 4, 5, 6 తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ శ్రీకళ, అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి జయమాలిని, డీఈఓ రోహిణి, సీనియర్ సర్వేలైన్స్ మెడికల్ ఆఫీసర్ మురారీ, తదితరులు పాల్గొన్నారు.

వీరసావర్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి



వీరసావర్కర్‌కు నివాళి అర్పిస్తున్న కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి, గౌతమ్‌రావు, కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్లేయుల గుండెల్లో నిద్రించి దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన వీరసావర్కర్ పోరాట పటిమను నేటి యువత మార్గదర్శకంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమరయోధుడు వీరసావర్కర్ 58వ వర్ధంతి సందర్భంగా సోమవారం కాచిగూడ చౌరస్తా వద్ద గల వీరసావర్కర్ విగ్రహానికి కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఎంతోమంది మహనీయులు ప్రాణాలను త్యాగం చేశారని, వారిలో వీరసావర్కర్ ఒకరని కొనియాడారు. యవ్వనమంతా జైలులోనే గడిపిన దేశభక్తుడు వీరసావర్కర్ అని అన్నారు. నేటి యువత వీరసావర్కర్ పోరాట ప్రతిమను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన మార్గదర్శకంలో విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. దేశంకోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్య ప్రకాష్‌సింగ్, నాయకులు శ్యాంరాజ్, సి.వినోద్‌యాదవ్, కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, క్షీరసాగర్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మాలలకు అన్యాయం చేసే పార్టీలపై తిరుగుబాటు చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా, మాలల పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలపై తిరుగుబాటు చేయకపోతే మాలల ఉనికికే ప్రమాదమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీ.ఎల్.రాజు అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59 ఎస్సీ ఉపకులాలకు చెందాల్సిన రిజర్వేషన్లలో 12 శాతం కేటాయించాలన్న ఎమ్మార్పీఎస్ వాదనను తిప్పికొట్టాలని అన్నారు. సమావేశంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ భాస్కర్‌రావు, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జేఎన్.రావు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హర్షల రాజు, నక్కా దేవేందర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిజాల ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

ముషీరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీ నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అచ్యుత్‌రామయ్య, ఉపాధ్యక్షులుగా గంగారాం, ముత్యాలు ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులు బీఆర్ఎస్ నాయకుడు పూస గోరక్‌నాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహలను కలిశారు.

ఆహార కల్తీ పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హన్మకొండ, మహబూబ్‌నగ్, నిజామాబాద్, సిద్దిపేటలలో ఆహారకల్తీ పరీక్ష కేంద్రాలఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డా.పల్లెపాడు దామోదర్ కోరారు. సోమవారం నాచారంలో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల మైక్రో బయాలజీ ఆహార కల్తీపరీక్ష కేంద్రంను ఆయనతోపాటు వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి, క్యాట్కో చైర్మన్ శంకర్‌లాల్ చౌరాసియా, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంక్షేమసంఘం ప్రధానకార్యదర్శి కాసు విశ్వేధర్ రాజులు సందర్శించి ఆహారకల్తీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ చీఫ్ పబ్లిక్ అనలిస్ట్ జి. లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ ఆహారకల్తీవల్ల మోసపోయామని ఎవరైనా అనుమానం కలిగితే బాధితుడు 209 రూపాయలు రుసుము చెల్లించి నాణ్యతా పరీక్షలు చేయించుకోవచ్చునని చీఫ్ పబ్లిక్ అనలిస్ట్ లక్ష్మీనారాయణ వివరించినట్లు వెల్లడించారు.

నామినేటెడ్ పదవుల్లో ఎరుకలకు అవకాశం కల్పించాలి

రాంనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎరుక కులస్థులకు 500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఏకలవ్య ఎరుకల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి కోరారు. సోమవారం నాంపల్లిలోని ఇందిరాభవన్‌లో తెలంగాణ ఏకలవ్య జేఏసీ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనా ఏకలవ్య జాతికి చెందిన వారు చట్టసభల్లో అడుగు పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ ఏకలవ్య ఎరుకల జేఏసీ కమిటీని ప్రకటించారు. కమిటీ వైస్ చైర్మన్లుగా కూరకుల కృష్ణ, రాయపురం సాంబయ్య, శ్రీరాం శివకుమార్, కేసారం ఎల్లయ్య, బుడ్డ సత్యనారాయణ, దేవరాజు సంజీవ్, కూతాటి రవికుమార్, దేవసాని కృష్ణ, బస్వపురం రఘు, కూరకుల మల్లికార్జున్, నల్గొండ సాంబయ్య నియమితులయ్యారు.

పోస్టల్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు పి.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లి పీ అండ్ టీ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఆలిండియా ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఎంజీ. ఎంటిఎస్ గ్రూప్ హైదరాబాద్ సార్టింగ్ డివిజన్ బ్రాంచ్ ద్వైవార్షిక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే పార్టీకే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలని పోస్టల్ ఉద్యోగులు తీర్మానించినట్లు తెలిపారు. తపాలా శాఖను ప్రైవేటీకరించే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు. సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదిస్తూ తీర్మానించారు. హైదరాబాద్ సార్టింగ్ డివిజన్ రీజనల్ కార్యదర్శి సీఎన్.నాయుడు యూనియన్ నాయకులు ముక్తార్ అహ్మద్, మహ్మద్ జలాలుద్దీన్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం బీసీలు ఏకం కావాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారం కోసం బీసీలు ఏకం కావాలని తెలంగాణ బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు కొహూరి భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం బర్కత్‌పురలో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, ఆర్.వి.మహేందర్‌కుమార్, జెల్లపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు.

అప్రకటిత ఎమర్జెన్సీని ఎదుర్కోవాలి

● ప్రొఫెసర్ నిరంజన్ ఆరాధ్య



మాట్లాడుతున్న నిరంజన్ ఆరాధ్య

రాంనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కొనసాగుతున్న అప్రకటిత ఎమర్జెన్సీని ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రొఫెసర్ నిరంజన్ ఆరాధ్య పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన భారత్ బచావో ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని పాలకులు ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఎన్ఈపీ- 2020 భారత మూఢత్వం గురించి తప్పితే శాస్త్రీయ దృక్పథం గురించి మాట్లాడడం లేదని పేర్కొన్నారు. దేశంలో సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పి అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వాటితోనే రాబోయే ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే దేశానికి ప్రమాదకరమన్నారు. విద్యార్థులు అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రొఫెసర్ రామ్‌పునయిని, ప్రొఫెసర్ హరగోపాల్, గాదె ఇన్నయ్య, ఎం.ఎఫ్.గోపినాథ్, జె.రమేష్‌బాబు, సిద్ధార్థ సేథూ, సుజిత్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందని, దీనిని విద్యార్థి లోకం అడ్డుకోవాలన్నారు. ఎన్‌సీఆర్‌సీలో ముస్లిం రాజుల చరిత్రను చెరిపేస్తున్నారని పేర్కొన్నారు. రాముడి చరిత్రనే భారతదేశ చరిత్రగా వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు.

సేవాలాల్ మహరాజ్ క్రికెట్ కప్ విజేత ఇబ్రహీంపట్నం జట్టు



ఇబ్రహీంపట్నం జట్టుకు కప్పు అందజేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ఎల్‌బీస్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ క్రికెట్ కప్ పోటీల్లో కేఎస్ఎం ఇబ్రహీంపట్నం జట్టు విజేతగా నిలిచింది. మాజీ ఎంపీ వి.హనుమంతరావు విజేతకు ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి, రన్నర్‌గా నిలిచిన శంషాబాద్ జట్టుకు యాభై వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రాల్లో 15 ఎకరాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని కోరారు. టోర్నమెంట్ నిర్వాహకుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడానికి సేవాలాల్ మహరాజ్ జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, వెయిట్ లిఫ్టర్ సుకన్య, రాజేందర్‌నాయక్, భరత్‌చంద్రారెడ్డి, నవీన్‌నాయక్, అయ్యప్ప, దిలీప్ పాల్గొన్నారు.

సౌండ్ హీలింగ్స్‌తో ఒత్తిడి దూరం

రాంనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : సౌండ్ హీలింగ్స్‌తో విద్యార్థులపై ఒత్తిడి ఉండదని మైండ్ వెల్నెస్ కోచ్ కావ్యబాగ్ చాందిని అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కళాశాల ఆవరణలో సౌండ్ హీలింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఘంటసాల గీతాలతో గానార్చన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో సోమవారం ప్రఖ్యాత గాయకుడు ఘంటసాలను స్మరిస్తూ ప్రముఖ గాయకులు పీఆర్‌కే.ఫణి, నిషితరమణిలు యాభై ఒక్క యుగళ గీతాలతో గానార్చన చేసి శ్రోతలను రంజింపచేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షుడు డా.చిట్టెన్‌రాజు సంస్థ పక్షాన ఫణి, నిషిత రమణికి ఘంటసాల స్వరరాగ విపంచి బిరుదు ప్రదానం చేశారు. సంస్థ స్థాపకులు వంశీరామరాజు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేతన సవరణలో 63 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వేతన సవరణలో 63 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ (ట్రేటా) విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర రెండో వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.రవిశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ట్రేటా అధ్యక్షుడు పి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పి.విజయ్‌కుమార్, సలహాదారులు ఎన్.రాములు ముదిరాజ్ తెలిపారు. వేతన సవరణ సంఘంలో పెన్షనర్లకు లబ్ధి చేకూర్చే విధంగా 63 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు.

ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై రాయితీ ఇవ్వండి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై రాయితీ కల్పించాలని కోరుతూ జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భారీగా పేరుకుపోయిన బకాయిల వసూలు ద్వారా ఆదాయం పొందొచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రేటర్‌లో 18.93 లక్షల ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. వీరిలో 30శాతం మంది ప్రతి యేటా పన్ను చెల్లించడం లేదు. గ్రేటర్‌లో ప్రస్తుతం రూ.8వేల కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ.5 వేల కోట్లు అసలు పన్ను కాగా.. రూ.3 వేల కోట్లు వడ్డీ. వడ్డీపై రాయితీ ప్రకటించిన నేపథ్యంలో అసలులో కొంతయినా వసూలవుతుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తూ రెండు దఫాలుగా వన్ టైం స్కీమ్(ఓటీఎస్) ప్రకటించారు. దీంతో రూ.575 కోట్ల పన్ను వసూలైంది. ప్రస్తుతం అప్పులకు వాయిదాలు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నేపథ్యంలో మరోసారి వడ్డీపై రాయితీ కల్పిస్తే ఆదాయం మెరుగుపర్చుకోవాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. త్వరగా సర్కారు నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఓ అధికారి తెలిపారు. కాగా రూ.5 వేల కోట్ల పన్ను బకాయిల్లో రూ.3 వేల కోట్లకుపైగా ప్రభుత్వ ఆస్తుల నుంచి రావాల్సి ఉంది.

సీఎంను కలిసిన తైక్వాండో ప్రతినిధులు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన తైక్వాండో అకాడమీ చైర్మన్ బాబూలాల్, కోచ్ లక్ష్మీనారాయణ

ముషీరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో అకాడమీ చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జి బాబూలాల్, తైక్వాండో సీనియర్ కోచ్ లక్ష్మీనారాయణ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బాబూలాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారులకు కావల్సిన సౌకర్యాలను కల్పించాలని కోరారు.

వ్యాయామంతో ఆరోగ్యం : ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రోజూ వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం వైఎస్ఆర్ పార్కు వద్ద గల జీహెచ్ఎంసీ మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డి) సౌజన్యంతో ప్రముఖ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి సహకారంతో రూ. 10 లక్షల విలువ చేసే జిమ్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి ఎస్ఆర్‌డి సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

సబర్మతినగర్‌లో సివరేజీ సమస్య పరిష్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సబర్మతినగర్ బస్తీలో సీవరేజి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం బస్తీవాసుల ఫిర్యాదుపై స్పందించిన ఆమె వాటర్‌బోర్డ్ మేనేజర్ కృష్ణమోహన్‌తో సంప్రదించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బస్తీల్లో డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేనేజర్‌కు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బీజేపీ, బీజేవైఎం నేతలు పాల్గొన్నారు.

నకిలీ ఐడీలు సృష్టించి అమాయకులకు బురిడీ

యువతి పేరిట చాటింగ్ చేసి నగర యువకుడికి రూ. లక్ష టోకరా.. నిందితుడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో ప్రముఖుల పేరిట నకిలీ ఐడీలు సృష్టించి... మాయమాటలతో డబ్బులు కాజేస్తున్న నిందితుడిని సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విశాఖపట్నానికి చెందిన తమ్మారెడ్డి శశాంక్‌రెడ్డి (24) జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తూ రంగారెడ్డి జిల్లాలో నివాసముంటున్నాడు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో నకిలీ ప్రొఫైల్స్, ఐడీలు సృష్టించి... ప్రముఖుల ఫోటోలు, వారి వివరాలు సేకరించి వాటితో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి అమాయకులను బురిడీ కొట్టిస్తుంటాడు. ఒకవేళ యువతులు తారసపడితే వారితో చాటింగ్ చేసినట్లు నటిస్తూ... మాయమాటలు చెబుతూ... అర్జెంట్‌గా డబ్బులు అవసరమని మభ్యపెట్టి డబ్బులు తెప్పించుకుంటాడు. పురుషులు తారసపడితే యువతుల ప్రొఫైల్‌తో బురిడీ కొట్టిస్తుంటాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన యువకుడు మోసపోయి సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. మేఘనా రఘుపాత్రుని పేరిట ఐడీ సృష్టించి... సోషల్‌మీడియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని యువకుడితో సంభాషణ ప్రారంభించాడు తనకెంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని నమ్మించి.. ఆ తర్వాత అతడినే పెళ్లి చేసుకుంటానని కూడా చెప్పి బాధితుడిని బుట్టలోకి దించాడు. ఆ తర్వాత సడెన్‌గా గత డిసెంబర్ 26న తల్లి చనిపోయిందని.. అర్జెంట్‌గా రూ. 3వేలు అవసరమని అడిగాడు. ఆ తర్వాత ఆస్పత్రులు, ఇంటి అద్దె, ఇతర ఖర్చుల పేరిట తరచూ డబ్బులు అడగసాగాడు. అతడిని నమ్మిన యువకుడు అతను అడిగినప్పుడల్లా డబ్బులు పంపించాడు. మొత్తంరూ. 1.05లక్షలు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత... ఫోన్ చేస్తే మాట్లాడకుండా చాటింగ్‌లకే పరిమితం కావడం... కలుద్దామంటే కలవకుండా తప్పించుకోవడంతో బాధితునికి అనుమానొచ్చి తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని అడగసాగాడు. అనుమానంతో పోలీసులను ఆశ్రయించగా దర్యాప్తు చేసి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిపై చైతన్యపురిలో పోక్సో కేసు, సైబరాబాద్‌లో సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. నిందితుడి నుంచిమొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరుతో రూ. కోట్లు కొల్లగొట్టిన ఘనుడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే.. అతి తక్కువ సమయంలోనే రూ. కోట్లు సంపాదించొచ్చు అంటూ.. యూ ట్యూబ్‌లో వీడియోలు చేస్తూ.. వందలమందిని ప్రభావితం చేసి రూ. కోట్లు కొల్లగొట్టిన మోసగాడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శివకుమార్ అనే వ్యక్తి ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వహిస్తూ.. రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, లాభాల గురించి వీడియోలు చేసి పోస్టుచేస్తూ వందల సంఖ్యలో ఫాలోవర్స్‌ను సంపాదించుకున్నాడు. ఎక్కడ పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయనే విషయాలు విశదీకరిస్తూ ఆకట్టుకునేవాడు. ఆ వీడియోలు చూసిన చాలా మంది అతడి మాటలకు ప్రభావితులై నేరుగా సంప్రదించి రూ. కోట్లలో పెట్టుబడి పెట్టారు. ఇదే మంచి అవకాశంగా భావించిన శివకుమార్ పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారి నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టి రిటర్న్స్ ఇవ్వకుండా ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గుర్తించి మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించిన క్రమంలో.. అతడి మాయలో పడి పదుల సంఖ్యలో బాధితులు మోసపోయి రూ. కోట్లలో సమర్పించుకున్నట్లు తెలిసింది. కొల్లగొట్టిన డబ్బు నిందితుడు ఏం చేశాడు..? ఎక్కడ పెట్టాడు..? అనే విషయమై సీసీఎస్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

నగరానికి చేరిన రుత్విక్ రాజన్ మృతదేహం

తిరుమలగిరి ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పూర్తి చేసేందుకు అమెరికా వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో వారం రోజుల క్రితం మృతి చెందిన ఓ యువకుడి మృతదేహం సోమవారం నగరానికి చేరుకుంది. సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన తులసీరాజన్-మాధవి దంపతుల కుమారుడు రుత్విక్ రాజన్(30) రెండేళ్ల క్రితం అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లాడు. టెక్సాస్ యూనివర్సిటీ లో ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉంటూ స్నేహితులతో కలిసి డెన్వర్‌లో ఉంటున్నాడు. గత సోమవారం స్నేహితులతో కలిసి ఓ హోటల్‌లో భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలడంతో ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అవడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేసి 12గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచారు. 8 గంటలు గడిచేలోపే రుత్విక్ రాజన్ మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహం సోమవారం తిరుమలగిరిలోని ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఎల్బీనగర్ డీసీపీ మురళి, పలువురు స్థానికులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తిరుమలగిరిలోని స్వర్గవాటికలో అంత్యక్రియలు జరిగాయి.